ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
మంగళవారం 6 మే 2025



'మండే' సూరీడు



చిత్తూరు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తం సోమవారం ఎండలు భగభగ మండాయి. ఓ పక్క ఎండ మంట, మరోపక్క భరించలేని ఉక్కపోత, ఇంకో పక్క అనధికార విద్యుత్ కోతలతో జనం అల్లాడిపోయారు. తవణంపల్లె మండలంలో అత్యధికంగా 41.3 ఉష్ణోగ్రత నమోదైంది.మండలాలవారీగా శ్రీరంగరాజపురంలో 40.1, చిత్తూరు, గుడిపాలలో 39.8, బంగారుపాళ్యంలో 39.4, పులిచెర్ల, పూతలపట్టు, రొంపిచెర్ల, వెదురుకుప్పంలో 38.9, సదుంలో 38.5, బైరెడ్డిపల్లె, చౌడేపల్లె, ఐరాల, నింద్ర, పెనుమూరు, విజయపురం, యాదమరిలో 38.2, గుడుపల్లె, నగరి, శాంతిపురం, వి.కోటలో 38.1, గంగవరం, పెద్దపంజాణిలో 38, సోమలలో 37.8, గంగాధరనెల్లూరులో 37.5, పలమనేరులో 36.5, కార్వేటినగరంలో 36.2, రామకుప్పంలో 35.9, పుంగనూరులో 35.8, కుప్పంలో 35 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

9 మండలాల్లో వాన

జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో తొమ్మిది మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాలవారీగా.. చిత్తూరులో 40, యాదమరిలో 22.6, గంగాధరనెల్లూరులో 12.4, బైరెడ్డిపల్లెలో 7.6, బంగారుపాళ్యంలో 4.2, కార్వేటినగరంలో 3.4, నగరిలో 3.2, తవణంపల్లెలో 1.4, శ్రీరంగరాజపురంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

జంట ఏనుగుల హల్‌చల్



89పెద్దూరు రహదారిలో జంట ఏనుగులు

రామకుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో ఆదివారం రాత్రి జంట ఏనుగులు హల్‌చల్ చేశాయి. రామకుప్పం-89పెద్దూరు రహదారిపై విహరిస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశాయి. అనంతరం ననియాలతాండా గ్రామ సమీప పొలాలు, తోటల్లో స్వైరవిహారం చేశాయి.పశుగ్రాసం పంటను తిన్నంత తిని ధ్వంసం చేశాయి.అనంతరం మామిడితోటల్లో ప్రవేశించి పలు చెట్ల కొమ్మలను విరిచేశాయి.మామిడికాయలను నేలపాలు చేశాయి.ప్రస్తుతం జంట ఏనుగులను నారాయణపురం అడవిలోకి తరిమినట్లు ననియాల అటవీ విభాగాధికారి హరికుమార్ తెలిపారు. ఏనుగులు అడవికే పరిమితమయ్యేలా ట్రాకర్లు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. రైతులెవరూ రాత్రివేళ పొలాల వద్దకు వెళ్ళరాదని సూచించారు. అదేవిధంగా అటవీ ప్రాంత ప్రజలు చీకటి పడక ముందే ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఏనుగులు పొలాల వైపు వచ్చిన విషయం తెలిసిన వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.

లక్షమందికి పైగా ఈకేవైసీ పెండింగ్



బంగారుపాళ్యం మండలం జిల్లేడుపల్లెలో ఈకేవైసీ చేస్తున్న డీలర్

చిత్తూరు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులంతా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినా జిల్లాలో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.ఇంకా 1,03,289మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఏప్రిల్ నెలతో ముగిసిన గడువును మరో రెండు నెలలు పొడిగించిన విషయం తెలిసిందే. ఈ-పోస్ పరికరాల ద్వారా రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల వద్ద ఈకేవైసీ నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతోపాటు ఆన్‌లైన్‌లో కూడా చేసుకునే వెసులుబాటు ఉన్నా, ప్రజలకు అవగాహన లేదు. జిల్లాలోని సరిహద్దు గ్రామాలకు ఇంటర్నెట్ సిగ్నల్స్ అందకపోవడంతో వీరంతా డీలర్లు, ఎండీయూ వాహనాలపైనే ఆధారపడాల్సి వచ్చింది. సమీపంలోని డీలర్ల వద్దకు వెళ్లినా, ఆ కేంద్రాలు మూసి ఉంటున్నాయి. ఎండీయూ వాహనాలు వచ్చే సమయంలో కార్డుదారులంతా పనుల నిమిత్తం బయటకు వెళ్లిపోతున్నారు. ఈ సమస్యలతో లక్షమందికిపైగా కార్డుదారులు సకాలంలో ఈ ప్రక్రియ పూర్తిచేసుకోలేని స్థితిలో పడ్డారు.జిల్లాలో రేషన్‌కార్డుదారులు 16,70,470మంది కాగా వీరిలో ఇప్పటివరకు ఈకేవైసీ పూర్తయినవారు 15,37,402మంది. ఈకేవైసీ చేసుకోనివారు 1,03,289మంది ఉన్నారని డీఎస్వో శంకరన్ వివరించారు.

రేపు సత్యవేడుకు మంత్రి లోకేశ్

ఎల్లుండి ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు శంకుస్థాపన

తిరుపతి (కలెక్టరేట్), మే 5 (ఆంధ్రజ్యోతి): ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం తిరుపతి జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 3.40 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకునే ఆయన రోడ్డు మార్గాన 5.10 గంటలకు సత్యవేడులోని వీఎంకే కల్యాణ మండపం చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం 10.50 గంటలకు శ్రీసిటీకి చేరుకుని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం రోడ్డు మార్గాన 2.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని తిరుగుపయనం కానున్నట్లు కలెక్టర్ వివరించారు.

సూళ్లూరుపేట కమిషనర్‌పై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్యపై చిత్తూరులో పోలీసులకు ఫిర్యాదు అందింది. సోమవారం చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ స్థానిక వన్ టౌన్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. 'చిన్నయ్య తన తండ్రి బతికుండగా, ఆ విషయాన్ని దాచిపెట్టి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడని, తర్వాత తప్పుడు సర్టిఫికెట్లను అందజేసి పదోన్నతులు పొందాడు' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్ర మునిసిపల్ పరిపాలన శాఖ (డీఎంఏ) ఆదేశాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు విచారణ ప్రారంభించారు.

డీవైఈవోగా రొంపిచెర్ల ఎంఈవో



రొంపిచెర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డివిజన్ డీవైఈవో (ఎఫ్ఏసీ)గా రొంపిచెర్ల ఎంఈవో ఇందిరను నియమించారు.స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయరామరాజు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డీవైఈవోగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన స్థానంలో ఇందిర నియమితులయ్యారు.

'ఉపాధి' శ్రామికులపై తేనెటీగల దాడి

19 మందికి అస్వస్థత





అస్వస్థతకు గురైన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

శ్రీరంగరాజపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికులపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో 19 మంది అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం అంబరమహారాజపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డిపల్లె సమీపంలో సోమవారం ఉదయం కొండ కాలువ పనులు అదే గ్రామానికి చెందిన 25మంది ఉపాధి శ్రామికులు చేస్తున్నారు. ఉన్నట్టుండి వారిపై పెద్ద తేనెటీగలు దాడి చేయడంతో పరుగులు తీశారు. తేనెటీగలు కుట్టడంతో బాలకృష్ణయ్య(55), మహేంద్రన్ (38), శ్రీదేవి(40), మోహనమ్మ(45), కె.శ్రీదేవి (42), నాగరాజు(50), అమరామ్మ(53), ఎల్లమ్మ(38), జయచంద్రన్ (54), నాగరాజమ్మ(45), అన్నదమ్ములు.. ఆంజనేయులు(46), జరాచంద్రుడు(48)లతోపాటు మరో ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు. 12 మందిని ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీకి తరలించారు. ఏడుగురిని 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో ఆంజనేయులు, జరాచంద్రుడు తీవ్ర అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఏపీడీ మల్లికార్జున, ఎంపీడీవో మోహన మురళి, ఏపీవో లలితలు ఆస్పత్రికెళ్లి బాధితులను పరామర్శించారు.

నేడు డీఆర్సీ కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమీక్ష (డీఆర్సీ) కమిటీ సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లాకు చెందిన పార్లమెంటు, శాసనమండలి, శాసనసభ్యులు హాజరుకానున్నారు. వీరితో పాటు కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రత్యేక ఆహ్వానితులు, జిల్లా అధికారులు హాజరుకానున్నారు. వ్యవసాయ, అనుబంధ సంస్థలు, డీఆర్డీఏ, డ్వామా, జిల్లా పరిషత్, హౌసింగ్, విద్య, వైద్య, పంచాయతీరాజ్, పోలీసు తదితర ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమావేశంలో సమీక్షిస్తారు.కాగా మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి డీఆర్సీ సమావేశానంతరం సాయంత్రం 5 గంటల వరకు జిల్లా తెలుగుదేశం కార్యాలయంలో పార్టీ ముఖ్యులతో సమావేశమౌతారు.పార్టీ సంస్థాగత అంశాలపై సమీక్షిస్తారు.

పొలాల్లోనే టమోటా

ధరల్లేక.... కోత కూలీలు రాక వదిలేస్తున్న రైతులు



ఆవులకు మేతగా టమోటాలు

సోమల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎవరో కొంతమంది అదృష్టవంతులు తప్ప టమోటా రైతులంతా ఏటా నష్టాలు చవిచూస్తూనే వున్నారు.ఈ సారైనా మంచి ధరొస్తుందన్న ఆశతో సీజన్‌తో పనిలేకుండా టమోటా సాగునే నమ్ముకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.ఒక్క సోమల మండలంలోనే 3వేల ఎకరాల్లో టమోటా సాగు జరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. పెద్దఉప్పరపల్లె, సోమల, నంజంపేట, ఇరికిపెంట, నడింపల్లె, కందూరు తదితర పంచాయతీల్లో టమోటానే ప్రధాన పంట.ఎకరా సాగుకు దాదాపు రెండు లక్షల రూపాయల దాకా ఖర్చు చేస్తున్నారు.ప్రస్తుతం 30కిలోల బాక్సు రూ. 100కు చేరుకుంది. రెండో రకం 15కిలోల బాక్సు రూ.30లోపే పలుకుతోంది.సోమలలో మార్కెట్ యార్డు లేకపోవడంతో దూర ప్రాంతాలైన మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కోలారు, వడ్డిపల్లె క్రాస్‌కు టమోటాలను తరలిస్తుండడంతో రవాణా ఖర్చులు కూడా రైతులకు రావడం లేదు.బాక్సుకు రవాణా ఖర్చు కింద రూ. 20 చెల్లిస్తున్నారు. కమీషన్ మాత్రమే పదిశాతం మండీవాళ్లు తీసుకుంటున్నారు. మార్కెట్‌కు అధికంగా టమోటాలు రావడంతో కోతలు చేసేందుకు మండీవాళ్లు బాక్సులు కూడా ఇవ్వడం లేదు. మరోవైపు ఎండల తీవ్రతతో కూలీలు పనులకు సరిగా రావడం లేదు. దీంతో కూలీల ఖర్చులు పెరగడంతో కోతలు కూడా చేయలేక పోతుండడంతో తోటల్లోనే పండ్లు మాగి పోతున్నాయి. మార్చి నెలలో నాట్లు వేసిన రైతుల తోటల్లో దిగుబడులు మే 20 నుంచి వస్తాయి.దీంతో దిగుబడులు మరింత పెరిగి ధరలు మరింత దిగజారే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ధరలు పతనంతో పారబోసిన టమోటాలు

ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత

- ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సీఎస్ కృష్ణబాబు



కనమనపల్లె హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కృష్ణబాబు

కుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): పుట్టుకనుంచి మరణించే వరకు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జి ఆఫీసర్ ఎంటీ.కృష్ణబాబు అన్నారు. కుప్పం పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌లతో కలిసి కుప్పం ఏరియా ఆసుపత్రిని, గుడుపల్లె మండలం కనమనపల్లెలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. కనమనపల్లెలో గ్రామీణులతో సమావేశమై వైద్య ఆరోగ్య శాఖ ద్వారా వారికి అందుతున్న విస్తృత సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో టాటా కన్సల్టెన్సీ ద్వారా ఒక వినూత్న కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టామని చెప్పారు.ఈ సర్వేలో భాగంగా ఏఎన్ఎంలు, నర్సుల ద్వారా ఎన్సీడీ సర్వే చేసి బీపీ, షుగర్, రక్తహీనత వంటి పలు అంశాలపై పరీక్షలు నిర్వహించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి సమాచారం సేకరించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు సకాలంలో అందించడానికి ఈ సమాచారం తోడ్పడుతుందన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో దాదాపు 3 లక్షల జనాభా ఉందన్నారు. ఈ జనాభా ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి సేకరించిన సమాచారాన్ని డిజిటలైజ్ చేశామన్నారు. పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలకోసం ఈ సమాచారం ఉపయోగపడుతుందని చెప్పారు. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 25 మంది సిబ్బందితో కాల్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కాల్ సెంటర్లను సంప్రదించడం ద్వారా వైద్య సలహాలు పొందవచ్చన్నారు. కుప్పం నియోజకవర్గానికి త్వరలోనే హంద్రీ నీవా కాలువ ద్వారా నీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటిపారుదల శాఖ గుర్తించిన చెరువులను నీటితో నింపడం ద్వారా భూగర్భ నీటి మట్టం పెంచడానికి ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయ్యాయని చెప్పారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ వైద్య సేవల్లో లోటుపాట్లను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడాల్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి, గుడుపల్లె తహసీల్దారు సీతారాం తదితరులు పాల్గొన్నారు.



కాళికాపురంలో మిరప నూర్పిళ్లు

దిగుబడి లేక.. ధర రాక

పడిపోయిన ఎండు మిరప రేట్లు

విజయపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి, రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలు అన్నదాతల పాలిట కన్నీటి రాశులుగా మారుతున్నాయి. కోటి ఆశలతో మిరపను సాగు చేసిన రైతులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. రూ.లక్షల పెట్టుబడి పెట్టి పంటను సాగుచేస్తే ఓ వైపు దిగుబడులు రాక, మరోవైపు మార్కెట్లో ధరలు అమాంతం పడిపోవడంతో కొనేవారు లేక రైతులు కుదేలవుతున్నారు.విజయపురం మండలంలోని కేవీపురం, కాళికాపురం, ఎం.అగరం, జీఎంపురం ప్రాంతాలలో మిరపను ఎక్కుగా సాగు చేస్తున్నారు.విత్తనాలు, ఎరువులు, ఇలా అన్ని కలుపుకుని ఎకరాకు రూ.50 వేల నుంచి రూ. 75 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పచ్చి మిరపకాయలకు ధర లేకపోవడంతో ఎండు మిరపపై ఆశలు పెట్టుకున్నారు. కోత పనులు కూడా పూర్తయ్యాయి.అయితే ధర లేకపోవడంతో మిరపను కల్లాల్లోనే కుప్పలుగా ఆరబోసి పెట్టుకున్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి కేవలం 15 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు. మిరప నాటినప్పుడు మంచు తీవ్రత, ప్రస్తుతం ఎండల తీవ్రత వలన దిగుబడి సగానికిపైగా తగ్గిందని వాపోతున్నారు. ఎకరా మిరప సాగు చేస్తే దిగుబడి మూడు నుండి ఆరు క్వింటాళ్లు రావాలని, కానీ ఈ యేడాది రెండు క్వింటాళ్ళు కూడా దాటలేదని, అప్పు తెచ్చి పంట చేస్తే పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి కూడా రాలేదు



ఒక ఎకరా మిరప సాగు చేస్తే రెండు క్వింటాళ్ళ దిగుబడి కూడా రాలేదు. ఈ యేడాది వచ్చిన దిగుబడి మందులు పిచికారి చేయడానికి, కూలీలకే సరిపోయింది. పెట్టుబడి ఇచ్చిన వారికి తిరిగి చెల్లించలేక పోతున్నాం.

\- పార్వతి, కాళికాపురం

తిరుపతి గంగ జాతరకు నేడు చాటింపు



తిరుపతి, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగజాతర వేడుకలకు వేళయ్యింది.పొలిమేరలో మంగళవారం అర్ధరాత్రి వేసే చాటింపుతో తాతయ్యగుంట గంగమ్మ జాతర సంబరం మొదలుకానుంది. దీనికి ముందు ఉదయం 7 గంటలకు గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి పరిమళ, పవిత్ర జలాలతో అభిషేకం చేసి వడిబాల కట్టడంతో జాతర ప్రాధాన్యత సంతరించుకుంటుంది. సాయంత్రం గంగమ్మ జన్మస్థలమైన అవిలాల నుంచి సారె వస్తుంది. సారెతో పాటు కైకాల కులస్తులు నగర పొలిమేర్లలో చాటింపు వేస్తారు.

రోజుకో వేషం : వేలాది మంది భక్తులు చిత్ర, విచిత్ర వేషాలు ధరించి అమ్మవారిని దర్శించుకుంటారు. బుధవారం నుంచి వేషాల జాతర మొదలవుతుంది. తరాల తారతమ్యం భక్తి భావనకు అడ్డురాదని నిరూపిస్తూ వేషాలు వేయడానికి జనం పోటీపడతారు. 7వ తేదీ బైరాగి వేషంతో మొదలై బండవేషం, తోటివేషం, దొరవేషం, మాతంగివేషం వరకు వేషాల జాతర సాగుతుంది. 12వ తేదీ సున్నపుకుండల వేషాలను ఇద్దరు కైకాల కులస్థులు వేస్తారు. వీరు చిన్న గంగమ్మ, పెద్ద గంగమ్మలకు ప్రతీకలుగా భక్తులచేత పూజలందుకుంటారు. 13వ తేదీ మంగళవారం అసలు జాతర సంబరం మొదలవుతుంది. ప్రత్యేక అభిషేకానంతరం వజ్రకిరీటంలో దర్శనమిచ్చే గంగమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో పోటెత్తుతారు. విశేషంగా పొంగళ్లు, జంతుబలులు ఉంటాయి. గంగమ్మ ఆలయం ముందు విశ్వరూప స్థూపానికి బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారు చేస్తారు. 14వ తేదీ వేకువజామున విశ్వరూప ప్రతిమ చెంప తొలగించడంతో జాతర పరిసమాప్తమవుతుంది.

వరసిద్ధుడి ఆలయానికి రూ.8.49 లక్షల విరాళం



దాతకు రశీదు అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), మే 5 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి నంద్యాలకు చెందిన రఘుశరణేష్ సోమవారం రూ.8,49,983 ఆన్‌లైన్ ద్వారా విరాళంగా అందించారు. ఇందులో స్వర్ణరథం కోసం రూ.3,99,992, ఈ-హుండీకి 2,99,995, నిత్యాన్నదానానికి రూ.49,999, ఆలయాభివృద్ధికి రూ.49,999, ఉచిత ప్రసాదం తయారీకి 49,999, గో సంరక్షణ ట్రస్టుకు రూ.49,999 వినియోగించేలా కోరారు. దాతను ఏఈఓ రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణకు ఐటీసీతో ఒప్పందం

- తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీల ఎంపిక



స్థల పరిశీలన చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెత్త నిర్వహణకు ప్రభుత్వం ఐటీసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తిరుపతి కార్పొరేషన్‌తో పాటు పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. రెండు రోజుల క్రితం ఆయా మున్సిపాలిటీల ఇంజనీరింగ్ అధికారులు విజయవాడలో ఐటీసీ సంస్థ నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి వెళ్లి వచ్చారు. ఐటీసీ సంస్థ తడి, పొడి చెత్తను వేరు చేయడం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. కాగితం, ప్లాస్టిక్, లోహాలు వంటి పొడి వ్యర్థాల సేకరణకు ప్రత్యేక సంచులను అందజేస్తుంది. సేకరించిన చెత్తను ఎరువుగా మార్చి విక్రయిస్తుంది. ఇందులో భాగంగా రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ సిబ్బందితో కలిసి పరమేశ్వరమంగళం సమీపంలోని సర్వే నెం.218లో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు.

బిగ్‌బాస్ షోపై నా పోరాటం ఫలించింది

- తెలంగాణలో అందాల పోటీలు నిర్వహించడం మంచి పద్ధతి కాదు
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



మీడియాతో మాట్లాడుతున్న నారాయణ

తిరుపతి(ఆటోనగర్), మే 5 (ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ షో నిర్వాహకులపై తాను కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించిందని, హైకోర్టు నోటీసులు పంపడం శుభపరిణామమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ బిగ్‌బాస్ షోలు, అందాల పోటీలను నిర్వహించడం నీచ సంస్కృతి అన్నారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడం ముమ్మాటికీ అసాంఘిక చర్యగా అభివర్ణించారు. బిగ్‌బాస్ షో ద్వారా సమాజానికి హాని ఉందన్నారు. ఈ షోలకు ప్రజలు ఆకర్షితులై దేశ సంస్కృతిని చిన్నచూపు చూసే అవకాశముందన్నారు. బిగ్‌బాస్ షోలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను ఆపాలని పోలీస్ స్టేషన్లను, కోర్టులను ఆశ్రయించానని చెప్పారు. మూడేళ్లుగా ఈ పోరాటం చేస్తూ చివరకు హైకోర్టును ఆశ్రయించామన్నారు. కొంత కాలయాపన జరిగినా చివరకు హైకోర్టు బిగ్‌బాస్ షో నిర్వాహకులకు నోటీసులు పంపడం ఆనందంగా ఉందన్నారు. బిగ్‌బాస్ షోల ద్వారా నిర్వాహకులు సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇవ్వాలనుకున్నారో వివరణ ఇవ్వాలన్నారు. స్త్రీలను గౌరవిస్తున్న మన దేశ సంస్కృతిలో ఇలాంటి షోలు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో అందాల పోటీలు నిర్వహించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రపంచ దేశాలు భారత దేశ సంస్కృతి వైపు చూస్తుంటే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం స్త్రీలను పాశ్చాత్య సంస్కృతి వైపు మళ్లించే ప్రయత్నాలు చేయడం అన్యాయమన్నారు. దేశ ప్రజలపై ఇలాంటి ప్రభావాలు పడకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు, పి.మురళి, రాధాకృష్ణ, సి.పెంచలయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

జీవో నెంబరు 77 రద్దు చేయాలి : ఏబీవీపీ

చిత్తూరు సెంట్రల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు జీవో నెంబరు 77 శాపంగా మారిందని, వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ తిరుపతి కార్యాలయంలో చిత్తూరు జిల్లా ముఖ్య కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జీవో నెంబరు 77రద్దు చేయకుంటే బుధవారం నిర్వహించే ఐసెట్ పరీక్షను అడ్డుకుంటామని హెచ్చరించారు. యువగళం పాదయాత్రలో తాము అధికారంలోకి రాగానే ఈ జీవోను రద్దు చేస్తామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఏబీవీపీ నాయకులు సురేంద్ర, పవన్, నందకిషోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారగల్లు పంచాయతీకి రూ.1.28 కోట్ల మంజూరు

గుడిపాల, మే 5 (ఆంధ్రజ్యోతి): నారగల్లు పంచాయతీకి ఎట్టకేలకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చొరవతో రూ.1.28 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 15 ఏళ్లుగా నారగల్లు చెరువు కట్టకు మరమ్మతులు చేయడం లేదా నూతన రోడ్డు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులను స్థానికులు కోరారు. చివరకు ఎంపీ, ఎమ్మెల్యే కృషితో నిధులు మంజూరయ్యాయి. ఉపాధి పథకం కింద చెరువు కట్టపై బీటీ రోడ్డు నిర్మించడానికి రూ.72లక్షలు, రూ.56 లక్షలతో ఇదే పంచాయతీకి చెందిన కొత్తకోట, జామరగుడిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. త్వరలో పనులను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై పంచాయతీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

పకడ్బందీగా లా పరీక్షలు : ఎస్వీయూ వీసీ



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో బీఎల్ మూడవ సెమిస్టర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు వీసీ ప్రొఫెసర్ అప్పారావు పేర్కొన్నారు. అంజిమేడులోని ఈశ్వర్‌రెడ్డి లా కాలేజీ కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్ కింద ఒకరిని డీబార్ చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి

పరిష్కరించండి



అర్జీదారుల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, జేసీ విద్యాధరి

పలమనేరు, మే 5 (ఆంధ్రజ్యోతి):అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి అధికారులను ఆదేశించారు. సోమవారం పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల సమస్యలపై డివిజన్, మండలస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని కోరారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన ఈ ప్రత్యేక ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 273 మంది తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఆర్డీవో పి. భవాని, ఎస్‌డీసీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసనల హోరు

చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసనలు హోరెత్తాయి. మరోవైపు పలమనేరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించడంతో కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు. అయినా కొంతమంది బాధితులు వచ్చినా అర్జీలు తీసుకునేవారు లేకపోవడంతో వెనుదిరిగారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు
కనీస వేతనం రూ.35వేలివ్వాలి: ఏఐటీయూసీ

జిల్లాలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం కింద రూ. 35వేలను ఇవ్వాలని కలెక్టరేట్ ముందు ఏఐటీయూసీ నేతలు నిరసన తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ.. అనేక ప్రైవేటు సంస్థల్లో కనీస వేతనాలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

8 రోజులుగా సమ్మె చేస్తున్నా.. పట్టించుకోరా: సీహెచ్‌వోలు

సమస్యల పరిష్కారం కోసం ఎనిమిది రోజులుగా కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమని సీహెచ్‌వోలు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, ఈపీఎఫ్‌వోను పునరుద్ధరించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌వోలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.



ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసిన నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు



చిత్తూరులో కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సీహెచ్‌వోలు

పోలీసు పీజీఆర్ఎస్‌కు 38 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 38 అర్జీలు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. వచ్చిన అర్జీల్లో భూ తగాదాలపై 13, కుటుంబ తగాదాలపై 12, వేధింపులపై 4, ఇంటి తగాదాలపై 4, చీటింగ్‌పై 2, ఆస్తి తగాదాలపై 2, వేధింపులపై ఒకటి చొప్పున ఉన్నాయి.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయండి

- అధికారులకు ఎంటీ కృష్ణబాబు సూచన



అధికారులతో సమీక్షిస్తున్న కృష్ణబాబు

చిత్తూరు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జిల్లా జోనల్ ఇన్‌చార్జి ఆఫీసర్ ఎంటీ కృష్ణబాబు సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన సమావేశంలో సంక్షేమ పథకాల అమలును శాఖల వారీగా కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. కుప్పం అభివృద్ధితోపాటు జిల్లా సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని అధికారులతో అన్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దుల్లో జిల్లా ఉండటంతో పరిశ్రమల స్థాపనకు దృష్టి పెట్టాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంతోపాటు కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోనూ ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పొలాలపై ఏనుగుల దాడితో పలువురు రైతులు మృతి చెందుతున్నారన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ద్వారా 48 వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటుకు స్థలాలను గుర్తించామని తెలియజేశారు. ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడల్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పరిశీలన

చిత్తూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాత్రిని కూడా రాష్ట్ర ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు పరిశీలించారు. అపోలో ఎంవోయూ ప్రకారం ఉందా లేదా అని తనిఖీ చేశారు. అపోలో వైద్య సిబ్బందితో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. అలాగే డీసీహెచ్ఎస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఉషశ్రీతో మాట్లాడుతూ.. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు.



అపోలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కృష్ణబాబు

అనంతరం అపోలో, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలిచ్చారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సుధారాణి, అడిషినల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఏవో రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో దొంగలు పడ్డారు

- రెండిళ్లలో రూ.15లక్షల విలువైన బంగారు నగలు, వెండి వస్తువుల అపహరణ



జయరామ్ నాయుడు, ఇందుమతి ఇళ్లలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

పూతలపట్టు, మే 5 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులోని రెండిళ్లలో దొంగలు పడ్డారు. రూ.15లక్షల విలువైన బంగారు నగలు, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పోలీసుస్టేషన్ సమీపాన విశ్రాంత టీచర్ జయరామనాయుడు నివాసం ఉంటున్నారు. అనారోగ్యం కారణంగా బెంగళూరులోని బంధువుల ఇంటికెళ్లాడు. దీన్ని అదనుగా తీసుకున్న ఇద్దరు వ్యక్తులు తలకు హెల్మెట్, చేతికి గ్లౌజ్‌లు ధరించి పల్సర్ బైక్‌పై ఆదివారం రాత్రి ఆయన ఇంటివద్దకొచ్చారు. తాళాలు పగులగొట్టి లోపలకెళ్లి 210 గ్రాముల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అలాగే పక్కనే ఉన్న అమరరాజా కంపెనీలో పనిచేసే ఇందుమతి ఇంటికీ తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లి ఉన్నారు. దీన్ని గమనించిన దుండగులు ఆమె ఇంట్లోనూ చొరబడ్డారు. బీరువాలోని 70 గ్రాముల బంగారు నగలు, 150 గ్రాముల వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. రెండిళ్లలోనూ సుమారు రూ.15 లక్షలు విలువైన బంగారు నగలు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదుతో సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వేలిముద్ర నిపుణులను రప్పించి ఆధారాలను సేకరించారు.

10 నెలల్లో రూ.56.30 కోట్ల అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే జగన్మోహన్



మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. గత 10 నెలల కాలంలో రూ. 56.30 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. కట్టమంచి చెరువు పూడికతీత పనులపై ఇటీవల అసత్య ప్రచారాలు జరుగుతున్నాయన్నారు. నగర పరిధిలో భూగర్భ జలాలు పెంచడం, కట్టమంచి చెరువును సుందరీకరణ చేయాలనే మంచి ఉద్దేశంతో కలెక్టర్, ఎంపీ, అధికారులు, ప్రజాప్రతినిధుల అనుమతులతో పూడికతీత పనులు చేస్తున్నామన్నారు.అభివృద్ధిని ఓర్వలేని కొందరు అక్రమంగా మట్టి తవ్వుతున్నట్లు తప్పుడు ప్రచారం చేయడం తగదని సూచించారు.చెరువులో నీటి సామర్థ్యం పెరిగితే సుమారు 480కి పైగా మున్సిపల్ బోర్లు రీచార్జ్ అవుతాయని చెప్పారు.గంగినేని చెరువు, ఇరువారం చెరువుల్లో కూడా పూడికతీతపనులు చేపట్టి, సుందరీకరిస్తామన్నారు.ఈ పనులకు రాజకీయాలకు అతీతంగా ఎవరైనా ముందుకువస్తే పనులు అప్పగిస్తామని చెప్పారు.కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం, అక్రమాలు, దౌర్జన్యాలు, అక్రమార్జనలు, అప్రజాస్వామిక పాలనపై ఆ పార్టీ నేతలు బహిరంగ చర్చకు సిద్దమా అని సవాల్ విసిరారు.మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్ పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్, టీడీపీ నేతలు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, వసంత్ కుమార్, కాజూరు బాలాజి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పద్మావతీ పరిణయోత్సవాలు





తిరుమల, మే 5 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు తిరుమలలో వైభవంగా జరుగనున్నాయి. వైశాఖశుద్ధ దశమి శుక్రవారం పూర్వఫల్గుణి నక్షత్రంలో నారాయణవనంలో పద్మావతీ దేవిని శ్రీవేంకటేశ్వరునకు ఆకాశరాజు కన్యాదానం చేసినట్లుగా శ్రీవేంకటాచల మహాత్యం గ్రంథంలో పేర్కొన్నారు. ఏటా ఈ తేదీ నుంచి మూడు రోజులపాటు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో పరిణయోత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామి తొలిరోజు గజ వాహనంపై, రెండో రోజు అశ్వ వాహనంపై, చివరి రోజు గరుడ వాహనంపై కొలువుదీరి ఆలయం నుంచి ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ వేదిక వద్దకు చేరుకుంటారు. పక్కనే పల్లకీలో ఉభయ నాంచారుల్ని ఊరేగింపుగా తీసుకొస్తారు.

సందడిగా పెండ్లి వేడుకలు

శోభాయమానంగా తీర్చిదిద్దిన పెండ్లి మండపంలో నిత్యనూతన వధూవరులైన శ్రీవారిని, అమ్మవార్లను కొలువుదీర్చి ఎదుర్కోలు, పూలదండలు మార్చుకోవడం, పూలబంతులాట, నూతన వస్త్ర సమర్పణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీవారికి కొలువు(ఆస్థానం) నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరుపుతారు. పూల చెండ్లాట ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. మూడురోజుల పాటు ఇలానే పరిణయోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. కాగా, ఈ ఉత్సవాల నేపథ్యంలో మూడురోజుల పాటు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఇంజక్షన్లు వేసుకుని పరీక్షలు రాశా

- ఎస్పీ మణికంఠ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): 'నేను టెన్త్ చదివే రోజుల్లో అత్యధిక మార్కులు సాధించాలన్న కసితో చదివాను. దాంతో తీవ్ర ఒత్తిడికి గురవడంతో కంటిచూపు మందగించింది. రోజుకు రెండుసార్లు రెండు కళ్లకు ఇంజక్షన్లు వేసుకుని పరీక్షలు రాశా' అని ఎస్పీ మణికంఠ తెలిపారు. సోమవారం పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో టెన్త్‌లో 570 మార్కులకుపైగా సాధించిన పోలీసు పిల్లలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తాను చదువుకున్న రోజుల్లోని ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకెళ్లాలని సూచించారు. తమ పిల్లల ప్రతిభను గుర్తించి బహుమతులు ఇవ్వడంపై పోలీసులు ఆనందం వ్యక్తం చేశారు. ఎస్పీ చూపిన ప్రేమను తమతోపాటు పిల్లలు గుర్తించుకుంటారని చెప్పారు. ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానందకిశోర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఎస్బీ సీఐ భాస్కర్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీదుర్గ కుటుంబీకులకు ఎంపీ పరామర్శ



శ్రీదుర్గ కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన చిత్తూరు పార్లమెంటు తెలుగుమహిళ కార్యదర్శి శ్రీదుర్గ కుటుంబీకులను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పరామర్శించారు. సోమవారం సంతపేటలోని శ్రీదుర్గ నివాసానికి వెళ్లి ఆమె తండ్రి టీడీపీ సీనియర్ నేత, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ అపోలో ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమార్తె మృతి చెందిందని ఆరోపించారు. అపోలో యాజమాన్యంతో కుదుర్చుకున్న ఎంవోయూను రద్దు చేయాలని, నిర్లక్షంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీకి వినతిపత్రం సమర్పించారు.

బతికున్నా.. చంపేశారు..!

పీజీఆర్ఎస్‌లో ఓ దివ్యాంగుడి ఆవేదన



ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై విన్నవిస్తున్న ఎన్ఎంయూ నాయకులు



పలమనేరు, మే 5 ఆంధ్రజ్యోతి): తాను బతికే ఉన్నా.. చనిపోయానని రేషన్ బియ్యం ఇవ్వడం లేదని.. వికలాంగ పింఛను సైతం అందడం లేదని నగరి మండలం కాకవేడు గ్రామానికి చెందిన దివ్యాంగుడు బాలయ్య జాయింట్ కలెక్టర్ విద్యాధరికి విన్నవించాడు. తన భార్య ఇళ్లల్లో పాచిపని చేసుకుంటూ తనను పోషించుకుంటోందని వాపోయాడు. సోమవారం పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పలువురు సమస్యలపై విన్నవించారు. గాలివానకు నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకులు ఉమాపతి నాయుడు విన్నవించారు. పలమనేరు మండలం ముసలి మడుగు సమీపంలోని ఏటిగడ్డిండ్లు గ్రామస్తుల రాకపోకలకు కౌండిన్యనదిపై వంతెన నిర్మించాలని ఉమాపతి నాయడు కోరారు. ఆర్టీసీ సమస్యలపై నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కే.ఎస్‌బాబు, గణేష్, కేవీ రమణ అర్జీ అందించారు. గత 50 ఏళ్లగా సాగుచేసుకుంటున్న భూమిని తమకు ఒక్కో కుటుంబానికి 5 ఎకరాల చొప్పున పట్టాలు ఇవ్వాలని కోరుతూ రామకుప్పం మండలం మణీంద్రం పంచాయతీ గాంధీపురం ఎస్సీకాలనీ వాసులు జేసీకి విన్నవించారు. తండ్రి పేరున ఉన్న భూమిని తనపేరుకు మార్పుచేయాలని గంగవరం మండలం చీళ్లవారిపల్లికి చెందిన గురువిరెడ్డి వినతిపత్రం అందించారు. అలాగే తన స్వాధనంలో ఉన్న వంద చదరపు అడుగుల స్థలానికి పట్టా అందించాలని గంగవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సరోజమ్మ అధికారుల ఎదుట వాపోయారు. అదే మండలం కలగటూరు గ్రామానికి చెందిన రెడ్డెమ్మ తనకు కళ్లు కనిపించడం లేదని.. పింఛను మంజూరు చేయాలని కోరారు. బైరెడ్డిపల్లి మండలం చీలం పల్లి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు లక్ష్మీ తనకు మెరుగైన వైద్యం అందించాలని విన్నవించింది. పెద్దపంజాణి మండలం పెద్దకాప్పల్లి గ్రామానికి చెందిన కె.సీతమ్మ తాను క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నానని.. పింఛను ఇప్పించాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించింది. అలాగే జిల్లాలోని పలువురు తమ సమస్యలపై విన్నవించగా వారంరోజుల్లో వినతిపత్రాలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కుప్పంలో తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఆ సంస్థ ఉద్యోగులు సోమవారం కుప్పం మండల తహసీల్దారు చిట్టిబాబుకు వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ ఉద్యోగులకు పనిష్మెంట్ విషయంలో ఇచ్చిన సర్క్యులర్‌ను కుప్పం డిపోలో అమలు చేయాలని, చట్ట ప్రకారం ప్రయాణికులు ఇచ్చిన డబ్బులకు టికెట్లు తీసుకునే బాధ్యత ప్రయాణికులపైనే అమలు జరపాలని, గ్యారేజ్ సిబ్బంది సరిపడా లేకపోగా వారికి కావాల్సిన స్పేర్స్, టూల్స్ సరఫరా చేయాలని, మహిళా సిబ్బందికి ప్రత్యేక పరిస్థితుల్లో అవసరం అయిన సెలవులు మంజూరు చేయాలని, సంస్థలో వివిధ కార్యాలయాలలో, గ్యారేజ్‌లలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందికి, ఆన్ కాల్ డ్రైవర్స్‌కు కనీస వేతనం ఇవ్వాలని, పదవీ విరమణ చేసిన సిబ్బందికి కనీస పెన్షన్ , ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య పింఛను అమలు చేయాలని, సంస్థ పరంగా, ప్రభుత్వ పరంగా కొత్త బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు వి.మోహన్, కుప్పం డిపో అధ్యక్షుడు ఎస్ఎం.స్వామి, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, యూనియన్ నాయకులు టీవీ.కుమార్, ఎస్ఆర్.రాజా, ఎంసీ.నాయక్, బాలబ్రహ్మం, విజయ్ కుమార్, బాలకృష్ణ, గోవిందరాజులు, మొగిలీశ్వరయ్య, మురళీకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు నేలరాలిన మామిడి



పలమనేరు మండీకి చేరిన రాలిన మామిడి కాయలు

పలమనేరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో గత రెండు రోజులుగా కురిసిన గాలివానకు రాలిపోయిన మామిడి కాయలను రైతులు మండీలకు తరలిస్తున్నారు. మండలంలో ముసలిమడుగు, పెంగరగుంట, మండిపేట, మండిపేటకోటూరు, కాలువపల్లి, సముద్రపల్లి తదితర గ్రామాల్లోని మామిడి తోటల్లో అధికంగా మామిడి కాయలు రాలిపోయాయి. మరో 25 రోజుల్లో కోతకు వచ్చే దశలో ఉన్న మామిడి కాయలు గాలివానకు రాలిపోయాయి. ఈ ఏడాది తోటల్లో 30 శాతం మాత్రమే కాపు కనిపించగా గాలివానకు అందులో దాదాపు 40 శాతం మేర రాలిపోయాయని మామిడి రైతులు వాపోతున్నారు. రాలిపోయిన మామిడికాయలను మండీలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

వల్లిగట్ల ఏటిగడ్డలో తీరిన దాహార్తి



వల్లిగట్ల ఏటిగడ్డ హరిజనవాడలో బోరు

సోమల, మే 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం వల్లిగట్ల ఏటిగడ్డ దళితవాడలో ప్రజల దాహార్తి తీర్చడానికి టీడీపీ నాయకులు నూతన బోరు డ్రిల్లింగ్ చేశారు. సోమవారం ఆ బోరుకు ప్రభుత్వం మోటారు, పైపులు మంజూరు చేయడంతో పూజలు చేసి గ్రామస్తులకు నీటి సరఫరా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, పంచాయతీ కార్యదర్శి జయరాం, వాటర్‌షెడ్ మాజీ చైర్మన్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పలమనేరు వాసులకు పురస్కారాలు



గాండ్ల సంఘం నుంచి విశిష్ట పురస్కారాలు అందుకున్న పలమనేరు వాసులు

పలమనేరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రాంతానికి చెందిన ముగ్గురికి రాష్ట్ర గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం నుంచి పురస్కారాలు లభించాయని సంఘ జిల్లా అధ్యక్షులు ఏఆర్ కుమార్ తెలిపారు. సంఘం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పురస్కారాలకు ఎంపికైన పలమనేరుకు చెందిన వైద్య విభాగంలో పనిచేసే నాగమణి, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ బాబు, మర్రిమాకులపల్లి గ్రామానికి చెందిన కులవృత్తిలో ఉన్న శరవణ కుమార్‌లకు పురస్కారాలు లభించాయన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షులు వాకాటి హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి జామి పద్మావతి, గౌరవాధ్యక్షులు రెడ్డిరమేష్ ఘనంగా సన్మానించారని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి హేమాద్రి, ప్రోగ్రాం కన్వీనర్ గిరిశ్రీనివాస్, గాండ్లకుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

పలమనేరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ 4న ఆదివారం ఓ వ్యక్తి చనిపోయాడు. పోలీసులు మృతుడి వివరాలు తెలియకపోవడంతో అనాథ శవంగా భావించారు. దీంతో పలమనేరు సీఐ నరసింహరాజు సూచన మేరకు పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు నాగశివ, శక్తి, ప్రసాద్, యువరాజు, నరేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా రామచంద్ర నాయుడి జన్మదిన వేడుకలు



ఎన్టీఆర్ కూడలిలో రామచంద్రనాయుడి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

వి.కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు జన్మదిన వేడుకలు సోమవారం వి.కోటలోని ఎన్టీఆర్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఉదయాన్నే వీరాంజనేయస్వామి ఆలయంలో ఆయన పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన ం చేపట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, నేతలు రాంబాబు, సోమశేఖర్, శబరీష్, విశ్వనాథ్, నాగభూషణం, శివకుమారి, భక్తా, సతీష్, హరినాథరెడ్డి, నాసీర్, ఇక్బాల్, రామ్మూర్తి ఆచ్చారి, రెడ్డి భాస్కర్, నారాయణస్వామి, వెంకట్రామప్ప, కుమార్, జనార్దన్‌రెడ్డి, కేశవరెడ్డి, చిట్టిబాబు, త్యాగరాజ్, షేక్‌ఉమ్మర్, చందు, దాము, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీఎస్ తనిఖీలు



ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బందితో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ సీఎస్ కృష్ణబాబు

కుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఏరియా ప్రభుత్వాస్పత్రి, గుడుపల్లె మండలంలోని కమనపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సోమవారం కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌లతో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జి ఎంటీ.కృష్ణబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుప్పం ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి, వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం గుడుపల్లె మండలం కనమనపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎస్, కమిషనర్లు మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు వచ్చే రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారి ఆరోగ్య స్థితిగతుల గురించిన వివరాలతో కూడిన రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. బాధ్యతతో, సమర్థంగా విధులు నిర్వహించాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మందులు కొరత ఉంటే పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల నుంచి తీసుకొచ్చి రోగులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడాల్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి, టీడీపీ నాయకుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, డీసీహెచ్ఎస్ పద్మాంజలి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు



రొంపిచెర్లలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి జరగాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్లలోని ఆయన ఇంటి వద్ద సదుం, పులిచెర్ల, సోమల మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమస్యలు విన్నవించారు. అప్పటికప్పుడే పలు సమస్యలపై అధికారులతో సంప్రదించి పరిష్కరించారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, పులిచెర్ల జడ్పీటీసీ మురళీ, సోమల టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులునాయుడు, శివశంకర, రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాక కార్యదర్శి ధనంజయనాయుడు, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, నాయకులు ప్రసాద్‌రెడ్డి, రఘునాథ్, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను గౌరవిస్తేనే ఉజ్వల భవిష్యత్తు



విశ్రాంత ఉపాధ్యాయురాలు సరస్వతిని సన్మానిస్తున్న సుకుమార్

పుంగనూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను గౌరవించడం సంతోషదాయకమని విశ్రాంత డీఎస్పీ సుకుమార్ అన్నారు. సోమవారం స్థానిక విశ్రాంత ప్రజా భవన్‌లో విశ్రాంత ఉపాధ్యాయురాలు సరస్వతిని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను గౌరవించినప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత సంఘ నాయకులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం, భరత్ భూషన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు రాయితీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

గుడుపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల కోసం అందించిన రాయితీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో నాగరాజు కోరారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు రాయితీపై అందిస్తున్న పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరికరాలతో రైతులు వ్యవసాయ పనులను సులభంగా చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం రైతుల కోసం అందిస్తున్న రాయితీలను ఉపయోగించుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత నెల 24వ తేదీన అనారోగ్యంతో మరణించిన మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ కుటుంబానికి ఎస్పీ మణికంఠ సోమవారం ఆర్థికసాయాన్ని అందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఐడీఆర్ఎఫ్ కింద రూ.లక్ష చెక్కును మృతురాలి భర్త హరీష్‌బాబుకు అందించారు.

రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం పట్టణ పరిధిలోని అర్హత కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్, సచివాలయంలోనూ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.

12వ పీఆర్సీని ప్రకటించాలి: ఏపీటీఎఫ్



డీటీ ఇబ్రహీంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. జీవో 117కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన 9 రకాల పాఠశాల వ్యవస్థ గందరగోళంగా తయారైందన్నారు. పాత విధానం లోనే 1-5 తరగతుల ప్రాథమిక పాఠశాలలు, 1-8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 6-10 ఉన్నత పాఠశాలలు విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ ఇబ్రహీంకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు జగదీష్, శివశంకర్, మధు, వేణు, ప్రభాకర్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్'కు 5 అర్జీలు

చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చాయని కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. సోమవారం కార్యాలయ ఆవరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే పరిష్కారమయ్యే వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. వచ్చిన అర్జీల్లో.. ఇంజనీరింగ్‌కు 2, రెవెన్యూకు 2, ప్లానింగ్‌కు ఒకటి చొప్పున ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈ వెంకట్రామిరెడ్డి, టీపీవో సుభప్రద, ఇన్‌చార్జి మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సదుం వాసి మృతి



మృతిచెందిన నరసింహులు

పాకాల, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలో దామలచెరువు సమీపంలోని ఎన్‌హిల్స్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సదుం మండలం బూరగమంద పంచాయతీ గాదివారిపల్లెకు చెందిన ఎ.నరసింహులు (45) కొంతకాలంగా ఎన్‌హిల్స్ నగర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం సాయంత్రం కల్లూరు నుంచి ఎన్‌హిల్స్ నగర్‌కు మోటారు సైకిల్‌లో వస్తూ ఇంటికి వెళ్లడానికి తిరిగాడు. అదే సమయంలో వెనుక వైపు వస్తున్న కారు బలంగా ఢీకొంది. ప్రమాదంలో నరసింహులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

సోమల, మే 5 (ఆంధ్రజ్యోతి): పెద్దఉప్పరపల్లె-ఆవులపల్లె మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన సోమవారం సోమల మండలంలో జరిగింది. పెద్దఉప్పరపల్లె సచివాలయంలో జేఎల్ఎంగా విధులు నిర్వహిస్తున్న నవీన్ ఆవులపల్లె సబ్‌స్టేషన్ నుంచి పెద్దఉప్పరపల్లె సచివాలయానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా.. రాంపల్లెకు చెందిన రాజేశ్ స్వగ్రామానికి వస్తూ సీతమ్మచెరువు వద్ద అదుపుతప్పి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. గుర్తించిన కూలీలు వారిని పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీలో చేర్పించి చికిత్సలు అందించారు.

స్టాఫ్‌నర్సుల నియామకం చేపట్టండి

చిత్తూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుల నియామకం చేపట్టాలని ఏపీ జీఎన్ఏ సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు రాణి కోరారు. ఈ మేరకు ఆస్పత్రికి వచ్చిన రాష్ట్ర ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆమె మట్లాడుతూ గతంలో ఉన్న 400 బెడ్లను అపోలో వచ్చాక 850గా మార్చడం జరిగిందన్నారు. అయితే అందుకు తగ్గట్టుగా స్టాఫ్‌నర్సులు లేరని చెప్పారు. 78 మంది ఉండాల్సిన స్థానంలో 68 మంది మాత్రమే ఉన్నామన్నారు. దీనివల్ల పనిభారం పెరుగుతోందన్నారు. ఆమె వెంట సంఘ నాయకురాలు హిమబిందు ఉన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఫార్మసిస్టులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ చిత్తూరు యూనిట్ అధ్యక్షుడు జయచంద్ర తెలిపారు.

శేష వాహనంపై మృత్యుంజయేశ్వరుడి దివ్యతేజం



శేష వాహనంపై ఊరేగుతున్న మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు

చౌడేపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో నాలుగో రోజు శేష వాహనంపై స్వామివారు ఊరేగారు. సోమవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం శేష వాహనంపై ఉత్సవ మూర్తులను అధిష్టింప జేసి ప్రత్యేకంగా పూలు, ప్రభలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు స్వామివారికి దివ్వెలు, దీపాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా ఆర్యవైశ్య సంఘం సభ్యులు వ్యవహరించారు.

తిరుచ్చి వాహనంపై కోనేటిరాయుడి విహారం



ఊయలపై కొలువుదీరిన కోనేటిరాయస్వామి

గంగవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధ ఆలయమైన కీలపట్ల కోనేటిరాయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తిరుమల నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత కోనేటిరాయస్వామి వారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి కీలపట్ల గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు.

కాళభైరవేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న ఉభయదారులు



అలంకరణలో కాళభైరవేశ్వరస్వామి

కల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ జాండ్రపేటలోని మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కాళభైరవేశ్వరస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అనంతరం అష్ట భైరవ హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహా కుంభాభిషేకం వేడుకలు చేపట్టారు. కాళభైరవేశ్వరస్వామి విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా కురవపల్లికి చెందిన బడికల మధుసూదన్, బడికల యాదగిరి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలు టీవీ రెడ్డి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అర్చకులు రాజశేఖర్ దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

దుర్గంకొండ ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వయంభేశ్వరుడు

సోమల, మే 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం దుర్గంకొండ గార్గేయ మహర్షి ఆలయంలో సోమవారం మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, అభిషేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వినయ్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ద్రౌపదీ సమేత పాండవుల విగ్రహాల ఊరేగింపు



కల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేటలో సోమవారం ద్రౌపదీ సమేత పాండవుల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మంగళంపేట భారతంమిట్టలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఈనెల 9 నుంచి 25 వరకు మహాభారత యజ్ఞం వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా సోమవారం ఆలయంలో ద్రౌపదీ సమేత పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి

పుంగనూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, మహా మంగళ హారతులు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం కనకమహాలక్ష్మీ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఉభయదారులుగా పోలేపల్లె లక్ష్మీకాంతమ్మ, గీతాలక్ష్మీ, నందకుమార్, దొంతి నాగరాజు, అనిత వ్యవహరించారు.

- సోమల: కందూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. 7న గ్రామోత్సవం, అభిషేక పూజలు, రాత్రి పుష్పపల్లకిలో శివపార్వతులు, కన్యకాపరమేశ్వరి అమ్మవారు, సీతారాములు, పాలేటమ్మ తదితర గ్రామ దేవతల ఉత్సవమూర్తులను ఊరేగించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు రామకుప్పంలో వాసవీ జయంతి వేడుకలు

రామకుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీ జయంతిని వైభవంగా నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు, ఉత్సవమూర్తికి 102 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం గంటలకు మహామంగళ హారతి ఉంటుందన్నారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు.

రేపు రాజుపేటలో రామకోటి

రామకుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం రాజుపేటలోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం రామకోటి నామస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటలకు చెల్దిగానిపల్లెకు చెందిన రామకోటి రామన్న నేతృత్వంలో కలశ స్థాపన, రామకోటి నామస్మరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

డైయింగ్ యూనిట్లను పారిశ్రామికవాడకు తరలించాలి

● నగరి మున్సిపల్ కౌన్సిలర్ల డిమాండ్



ఆర్డీవో భవాని శంకరికి వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

నగరి మే 5 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని మాన్యువల్, మిషనరీ డైయింగ్ యూనిట్లను పారిశ్రామికవాడకు కేటాయించిన స్థలానికి తరలించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో భవాని శంకరికి వినతిపత్రం అందించారు. నగరి పట్టణ పరిధిలో సుమారు 60వేల మందికిపైగా జనాభా ఉంటే, దాదాపు సగానికిపైగా అంటురోగాలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పైగా చర్మ, కిడ్నీ, డయాలసిస్ వంటి వ్యాధులతో బాధపడటమే కాకుండా, తాగడానికి మంచినీరు లభ్యం కాని దుస్థితిలో పట్టణం ఉందని చెప్పారు. కౌన్సిలర్లు దయానిధి, బీడీ భాస్కర్, ఇంద్రయ్య, బాలన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు 12వ పీఆర్సీని ప్రకటించాలి: ఏపీటీఎఫ్



డీటీ ఇబ్రహీంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. జీవో 117కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన 9 రకాల పాఠశాల వ్యవస్థ గందరగోళంగా తయారైందన్నారు. పాత విధానం లోనే 1-5 తరగతుల ప్రాథమిక పాఠశాలలు, 1-8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 6-10 ఉన్నత పాఠశాలలు విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ ఇబ్రహీంకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు జగదీష్, శివశంకర్, మధు, వేణు, ప్రభాకర్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలసిన కార్వేటినగరం తమ్ముళ్లు



మంత్రి లోకేశ్‌తో సంధాని, మురళీమోహన్

వెదురుకుప్పం, మే5 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని తెలుగు యువత కార్వేటినగరం మండల అధ్యక్షుడు తోటి మురళీ మోహన్, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ సంధాని తెలిపారు. సోమవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో లోకేశ్‌ను కలసి సమస్యలపై విన్నవించారు.

రేషన్ షాపులో డీఎస్వో తనిఖీలు



పవన్‌ను విచారిస్తున్న డీఎస్వో శంకరన్

యాదమరి, మే 5 (ఆంధ్రజ్యోతి): దాసరాపల్లె రేషన్ దుకాణంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు డీఎస్వో శంకరన్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. సివిల్ సప్లయిస్ డీటీ శ్యామ్‌ప్రసాద్, తహసీల్దార్ పార్థసారథి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో సురేష్ తదితరులు ఆయనవెంట ఉన్నారు. రేషన్‌డీలర్ రేణుకను విచారించి, దుకాణం నిర్వహణ బాధ్యతను పవన్ అనే వ్యక్తికి ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. అలాగే పవన్‌ను కూడా విచారించారు. అనంతరం చౌక దుకాణంలో స్టాకును పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డీఎస్వో తెలిపారు.

'పీజీఆర్ఎస్'కు ఐదు అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చాయని కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. సోమవారం కార్యాలయ ఆవరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే పరిష్కారమయ్యే వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. వచ్చిన అర్జీల్లో.. ఇంజనీరింగ్‌కు 2, రెవెన్యూకు 2, ప్లానింగ్‌కు ఒకటి చొప్పున ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈ వెంకట్రామిరెడ్డి, టీపీవో సుభప్రద, ఇన్‌చార్జి మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాచపాళ్యంలో గంగ జాతరకు చాటింపు



గెరిగ ఊరేగిస్తున్న గ్రామస్తులు

పాలసముద్రం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాచపాళ్యంలో మంగళవారం గంగ జాతర నిర్వహించడానికి చాటింపు నిర్వహించారు. ఆదివారం రాత్రి రాచపాళ్యం పెద్దచెరువు వద్ద గ్రామస్తులు పొంగళ్లు పెట్టి, గ్రామ పొలిమేరల చుట్టూ చాటింపు వేశారు. సోమవారం ఉదయం, సాయంత్రం గెరిగను ఊరేగించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



హరీష్‌బాబుకు చెక్ అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత నెల 24వ తేదీన అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ లక్ష్మి కుటుంబానికి ఎస్పీ మణికంఠ సోమవారం ఆర్థికసాయాన్ని అందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఐడీఆర్ఎఫ్ కింద రూ.లక్ష చెక్కును మృతురాలి భర్త హరీష్‌బాబుకు అందించారు.

స్కిల్ ఆఫ్ డిజిటల్‌పై రైతులకు శిక్షణ

బంగారుపాళ్యం, మే 5 (ఆంధ్రజ్యోతి): స్కిల్ ఆఫ్ డిజిటల్‌పై 40 మంది రైతులకు శిక్షణ కార్యక్రమం టేకుమందలో సోమవారం జరిగింది. జిల్లా మానిటరింగ్ అధికారి విజయ్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాంకేతికతను వాడి సాగు చేసే విధానాన్ని సమగ్రంగా తెలియజేశారు. రిసోర్స్ పర్సన్ యాస్మిన్, రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ స్వాతి, ఎంపీఈవో రాణిప్రమీళ, రైతులు పాల్గొన్నారు.

గుడిపాల: సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ ఉమ, ఏవో మాధవి, శిక్షణ నిర్వాహకులు యోగప్రియ, రైతులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని పోలవరం రైతు భరోసా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ నాగపద్మిని, మండల వ్యవసాయ శాఖ అధికారి మధురవాణి, సిబ్బంది రాకేష్, అనురాధ, నీలిమ, ప్రభావతి, రైతులు పాల్గొన్నారు.

పెనుమూరు: రైతు సేవాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, వీఏఏ డిల్లీబాబు, రైతులు పాల్గొన్నారు.

గంగజాతరకు నేడు చాటింపు

చిత్తూరు కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించే నడివీధి గంగమ్మ జాతరకు మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు చాటింపు వేయనున్నారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉత్సవ నిర్వాహకులు సీకే లావణ్య సోమవారం పొన్నియమ్మ ఆలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు హేమంత్ కుమార్, గోల్డ్ వెంకటేష్, వేమారెడ్డి, గుణశేఖర్, గురుమూర్తి, అర్చకుడు కేదారేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి సెలవుల పెంపుపై హర్షం

గంగాధరనెల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులను 180 రోజులకు పెంచడంపై రాష్ట్ర తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కె.యుగంధరాచారి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

గాలివానకు నేలరాలిన మామిడి

ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు



కీనాటంపల్లెలో రాలిపోయిన మామిడి కాయలు

బంగారుపాళ్యం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాగిమానుపెంట, వెలుతురుచేను, షులిమడుగు, కొదలమడుగు, కీరమంద, టీఎల్ కండ్రిగ, చంద్రశేఖర్‌పురం, ఎర్రాండపల్లె, 170 గొల్లపల్లె తదితర గ్రామాల్లో ఆదివారం కురిసిన గాలివానకు సుమారు 150 టన్నులు మేర మామిడి నేలరాలింది. దీంతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. రాలిన కాయలను తీసుకుని బంగారుపాళ్యం మార్కెట్‌కు తరలిస్తే కిలో రూ.4 మాత్రమే పలికాయి. కాయలను మార్కెట్‌కు తీసుకొచ్చిన కూలీలు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తోటలను పరిశీలించిన తహసీల్దార్

యాదమరి: మండలంలో రెండ్రోజుల కిందట ఈదురుగాలులకు కీనాటంపల్లె, ఎర్రచేను, ఆరిమాకులపల్లె పరిధిలో చేతికొచ్చిన మామిడి కాయలు నేల రాలి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కీనాటంపల్లెలోనే 84 టన్నుల కాయలు నేలరాలినట్లు తెలియడంతో సోమవారం తహసీల్దార్ పార్థసారథి ఆ గ్రామంలోని తోటలను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేసి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



రాలిపోయిన కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుల నియామకం చేపట్టండి

చిత్తూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుల నియామకం చేపట్టాలని ఏపీ జీఎన్ఏ సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు రాణి కోరారు. ఈ మేరకు ఆస్పత్రికి వచ్చిన రాష్ట్ర ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆమె మట్లాడుతూ గతంలో ఉన్న 400 బెడ్లను అపోలో వచ్చాక 850గా మార్చడం జరిగిందన్నారు. అయితే అందుకు తగ్గట్టుగా స్టాఫ్‌నర్సులు లేరని చెప్పారు. 78 మంది ఉండాల్సిన స్థానంలో 68 మంది మాత్రమే ఉన్నామన్నారు. దీనివల్ల పనిభారం పెరుగుతోందన్నారు. ఆమె వెంట సంఘ నాయకురాలు హిమబిందు ఉన్నారు.

ఫార్మసిస్టులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు: చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఫార్మసిస్టులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ చిత్తూరు యూనిట్ అధ్యక్షుడు జయచంద్ర తెలిపారు. ఈ మేరకు కృష్ణబాబు దృష్టికి తీసుకొచ్చారు. 850 బెడ్లకు కేవలం తొమ్మిది మంది ఫార్మసిస్టులు మాత్రమే పనిచేస్తున్నామని చెప్పారు.



కృష్ణబాబుకు సమస్యలు తెలియజేస్తున్న ఉద్యోగులు

యాదమరి గంగజాతర ప్రారంభం



గెరిగను ఊరేగిస్తున్న గ్రామస్తులు

యాదమరి, మే5 (ఆంధ్ర జ్యోతి): యాదమరి మండల కేంద్రంలో గంగమ్మ జాతర వేడుకలు ప్రారంభమయ్యాయి. రెండ్రోజులపాటు జాతర జరగనుంది. సోమవారం రాత్రి ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గెరిగను యాదమరి, చిన్నంపల్లె, దోనిరేవులపల్లె గ్రామాల పరిధిలో ఊరేగించారు. మంగళవారం ఉదయం పూజలు చేశాక.. అమ్మవారి విశ్వరూప దర్శనం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

అమరావతి పునః ప్రారంభంతో వైసీపీ నేతల్లో ఆందోళన: తెలుగు యువత

గంగాధరనెల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునః ప్రారంభంతో రాష్ట్రంలోని వైసీపీ నేతల్లో ఆందోళన పెరిగిపోయిందని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు పేర్కొన్నారు. ప్రధాని మోదీ అభయంతో రాజధాని అమరావతికి ఇక తిరుగులేదన్నారు. దీన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక.. అసత్య ప్రచారంతో విషం కక్కుతున్నారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలి: థామస్

వెదురుకుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం అంబరమహారాజపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డిపల్లె సమీపంలో సోమవారం ఉదయం తేనెటీగల దాడిలో 19 మంది ఉపాధి శ్రామికులు అస్వస్థతకు గురయ్యారు. వీరికి మెరుగైన వైద్య సేవలను అందించాలని యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ ఆదేశించారు. అలాగే బాధితులను ఆదుకోవాలని జీడీనెల్లూరు వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు.

'మాజీ ఎంపీటీసీపై ఆరోపణలు అవాస్తవం'

చిత్తూరు సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీటీసీ అరుణ కుమారిపై ఆరోపణలు అవాస్తవమని పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లెకు చెందిన దళితులు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ గ్రామానికి దారి సౌకర్యం కల్పించడానికి అరుణకుమారి సహకరించారని చెప్పారు. కొంతమంది తమ గ్రామానికి వచ్చేదారిని ఆక్రమించుకోవడానికి అరుణ కుమారిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ముమ్మరంగా వరినాట్లు



ఆలపాకం వద్ద వరినాట్లు వేస్తున్న మహిళలు

విజయపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి నాట్లలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. చెంగమనాయుడుకండ్రిగ, మంగళం, కళియంబాకం, మాధవరం, పన్నూరు ప్రాంతాల్లో వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. తెల్లగుంట ప్రాంతాల్లో ఒడిశా నుంచి వచ్చిన కూలీలు (పురుషులు) వరి నాట్లు వేస్తున్నారు. ఆలపాకం ప్రాంతాల్లో స్థానికంగా లభించే కూలీలు(మహిళలు) వరి నాట్లు వేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సదుం వాసి మృతి

పాకాల, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలో దామలచెరువు సమీపంలోని ఎన్‌హిల్స్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సదుం మండలం బూరగమంద పంచాయతీ గాదివారిపల్లెకు చెందిన ఎ.నరసింహులు (45) కొంతకాలంగా ఎన్‌హిల్స్ నగర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం సాయంత్రం కల్లూరు నుంచి ఎన్‌హిల్స్ నగర్‌కు మోటరుసైకిల్‌లో వస్తూ ఇంటికి వెళ్లడానికి తిరిగాడు. ఆసమయంలో వెనుక వైపు వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో నరసింహులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళలకు ప్రభుత్వం ఆర్థిక చేయూత

● ఎమ్మెల్యే మురళీమోహన్



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న మురళీమోహన్

యాదమరి, మే 5 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రభుత్వం ఆర్థిక చేయూత కల్పించడానికే ఉచిత కుట్టు శిక్షణను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. సోమవారం ఉదయం యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాలలో కుట్టు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. 90 రోజులపాటు శిక్షణ ఇచ్చాక కుట్టుమెషిన్ ఉచితంగా అందిస్తారన్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, యాదమరి టీడీపీ అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, నేతలు అమర్‌నాథ్‌నాయుడు, హేమగిరి, మాధవనాయుడు, వేణునాయుడు, సతీష్‌నాయుడు, పట్టాభి, గుణశేఖర్, విజయేంద్రయాదవ్, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఎస్ఐ ఈశ్వర్, ఎంఈవో రుక్మిణి, ఏపీఎం ఈశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు

నగరి, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని కాకవేడు, నెత్తంకండ్రిగ, మండలంలోని మాంగాడులో టీడీపీ సంస్థాగత ఎన్నికలను సోమవారం నిర్వహించారు. మండలానికి పరిశీలకులుగా రమేష్‌రాజు, పట్టణానికి షణ్ముగం రెడ్డి, బీవీ గణేషన్ వ్యవహరించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించి కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం



కొండమల్లీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు- ప్రత్యేక అలంకరణలో ఆవుదేవర నందీశ్వరుడు

వెదురుకుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీ సేవలో ఊరేగించారు. ● ఎగువ కన్నికాపురం వద్ద వెలసి ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి కూడా క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు. ● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి సోమవారం రుద్రాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీఎస్ తనిఖీలు

కుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఏరియా ప్రభుత్వాస్పత్రి, గుడుపల్లె మండలంలోని కమనపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సోమవారం కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌లతో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జి ఎంటీ.కృష్ణబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుప్పం ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి, వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం గుడుపల్లె మండలం కనమనపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎస్, కమిషనర్లు మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు వచ్చే రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారి ఆరోగ్య స్థితిగతుల గురించిన వివరాలతో కూడిన రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. బాధ్యతతో, సమర్థంగా విధులు నిర్వహించాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మందులు కొరత ఉంటే పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల నుంచి తీసుకొచ్చి రోగులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడాల్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి, టీడీపీ నాయకుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, డీసీహెచ్ఎస్ పద్మాంజలి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారమెప్పుడో?

పచ్చికాపల్లంవాసుల ఆవేదన

వెదురుకుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం కూడలిలో ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారమెప్పుడు లభిస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చికాపల్లం.. చిత్తూరు, తిరుపతి, పుత్తూరు ప్రాంతాలకు వెళ్లే రహదారి కూడలే కాకుండా తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు వెళ్లడానికి కూడా ఈ మార్గాన్నే వాహనచోదకులు ఎంచుకుంటారు. దీంతో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పచ్చికాపల్లం రహదారికి ఇరువైపులా దుకాణదారులు, ఇతరుల ఆక్రమణల వల్ల వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దుకాణాల ముందు బోర్డులు, ఇతరత్రా వాహనాల పార్కింగ్‌తోనూ సమస్య మరింత జటిలమవుతోంది.



పచ్చికాపల్లంలో స్తంభించిన ట్రాఫిక్

వారపు సంత రోజైతే మరిన్ని అవస్థలు

పచ్చికాపల్లంలో ప్రతి ఆదివారం జరిగే వారపు సంత సమయంలో జనానికి మరిన్ని ట్రాఫిక్ అవస్థలు తప్పవు. వారపు సంత నిర్వహణకు ప్రత్యేక షెడ్డు, వసతులు లేవు. దీనివల్ల రోడ్డుపైనే క్రయవిక్రయాలు జరుగుతుండటంతో ట్రాఫిక్ స్తంభిస్తుంది. ఇకనైనా తమకు ట్రాఫిక్ కష్టాలు తప్పించి.. వారపు సంతకు షెడ్డు నిర్మాణంతోపాటు తగిన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

రేపు రామకృష్ణారెడ్డి సంస్మరణ కార్యక్రమం



వెదురుకుప్పం, మే5 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఆచార్య బండి రామకృష్ణారెడ్డి(84) సంస్మరణ కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు మొండివెంగనపల్లెలో జరుగుతుందని ఆయన మేనల్లుడు యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగుశాఖ ఆచార్యుడు డాక్టర్ నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ద్రావిడ విశ్వవిద్యాలయ వీసీ దొరస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

పుస్తకాల వితరణ



చిత్తూరు రూరల్ మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయానికి భార్గవి, చంద్రహాస్‌లు కలిసి ఐఐటీ, జేఈఈ పుస్తకాలు, వైట్ బోర్డును సోమవారం వితరణ చేశారు. గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, అబాకస్‌పై శిక్షణ ఇచ్చినట్లు డిప్యూటీ లైబ్రేరియన్ లలిత తెలిపారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌వీఎస్ శర్మ, లైబ్రేరియన్ గజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

విజయపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో, కొళాయిలు వద్ద, వీధుల్లోనూ చెత్తా చెదారం తొలగించారు. పనులను ఎంపీడీవో రాజేంద్ర పర్యవేక్షించారు. జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

13న వాహనాల బహిరంగ వేలం

తవణంపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె పరిధిలో మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఈచర్ లారీ, ఆరు ద్విచక్ర వాహనాలను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్‌డెంట్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పోలీసుస్టేషన్‌లో అదే రోజున ఉదయం 10 గంటలకు నిర్దేశించిన ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

దుకాణాలపై దాడులు

చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుకాణాలపై నగరపాలక ప్రజారోగ్య అధికారులు దాడులు నిర్వహించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాలతో ఎంహెచ్‌వో లోకేష్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు చర్చివీధి, పొన్నియమ్మన్‌గుడివీధి పరిధిలోని ప్లాస్టిక్ విక్రయాల దుకాణాల్లో తనిఖీలు చేశారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు అధికంగా ఉన్న చర్చివీధిలోని ఓ దుకాణాన్ని మూయించారు. మరో ఆరు దుకాణాల నుంచి 105 కిలోల ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసి.. రూ.25వేల జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

అద్దెకు భవనాలు తీసుకున్న వారిపై కన్నేసి ఉంచాలి: ఎస్ఐ

పెనుమూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): అద్దెకు భవనాలను తీసుకున్న వారిపై కన్నేసి ఉంచాలని యజమానులకు ఎస్ఐ రామచంద్రయ్య సూచించారు. సోమవారం ఆర్‌వీఎస్ నగర్‌లోని సొంత భవనాల యజమానులతో స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఇది వరకు చాలా క్రైం కేసులు మీ ప్రాంతంలో నమోదయ్యాయని చెప్పారు. అద్దెకు ఇచ్చే ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. చిన్న సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

వెదురుకుప్పం ఎంపీడీవోగా పురుషోత్తం

వెదురుకుప్పం, మే 5 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎంపీడీవోగా ఎల్.పురుషోత్తంను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తుండిన అమరనాథ్ శ్రీకాళహస్తి ట్రైనింగ్ సెంటరుకు బదిలీ కావడంతో ఈ కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తంకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఆయన్నే రెగ్యులర్ ఎంపీడీవోగా నియమించారు.